ప్రభాత
ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 319 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శుక్రవారం 27 ఫిబ్రవరి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# ప్రభుత్వ పాఠశాలల్లో బస్సు సౌకర్యం ఏర్పాటు

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజులకు కళ్లెం, అధికంగా వసూలు చేస్తే రికవరీ

ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంలో రాజీ పడొద్దు : సీఎం రేవంత్‌రెడ్డి

విద్యాశాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష

కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక సదుపాయాల కల్పన పైన దృష్టి సారించాలని ఆదేశం

సమగ్ర నివేదిక అందించిన రాష్ట్ర విద్యా కమిషన్



**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం)**

భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యాశాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక సదుపాయాల కల్పన పైన దృష్టి సారించాలని అధికారులను ..మిగతా 2లో



# కేవలం కమిషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం

అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం చిమ్ముతున్న బిఆర్ఎస్

సిబిఐ విచారణ కోరినా పట్టించుకోని బిజెపి

మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ ప్రధాన ప్రతిపక్ష నాయకులు రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం చిమ్ముతున్నారని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. వరుస ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణను చూసి బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రాజెక్టుల అవినీతిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే ఎనిమిదో అద్భుతంగా చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం కమిషన్ల కోసమే కట్టారని పొంగులేటి ఆరోపించారు. 38 వేల కోట్లతో పూర్తి కావాల్సిన తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి, తమ రాచరికాన్ని చాటుకోవడం కోసం లక్షల కోట్లతో కాళేశ్వరం నిర్మించారు. తీరా చూస్తే ఎన్నికల ముందు ఆ ప్రాజెక్టు పేకమేడలా కూలిపోయిందని ఎద్దేవా చేశారు. గత నాలుగేళ్లలో 162 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేస్తే, అందులో 50 టీఎంసీలు తిరిగి సముద్రం పాలయ్యాయని ఆయన గణాంకాలతో వివరించారు. కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ కోరినప్పటికీ, బీఆర్ఎస్, బీజేపీల మధ్య ఉన్న అంతర్గత 'ఫెవికల్' బంధం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని మంత్రి ఆరోపించారు. కేంద్ర సంస్థల నివేదికల ఆధారంగానే తాము జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేశామని, కానీ దీనిపై అసెంబ్లీలో చర్చ జరిగే సమయంలో ..మిగతా 2లో

# తెలంగాణ ప్రజలు ఆకలినైనా సహిస్తారు కానీ, ఆధిపత్యాన్ని సహించరు

## ప్రభుత్వ పథకాల అమలు బాధ్యత మీదే.. శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులతో సిఎం రేవంత్



**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ ప్రజలు ఆకలినైనా సహిస్తారు కానీ, ఆధిపత్యాన్ని సహించబోరని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి గ్రూప్ 1 పరీక్షలను నిర్వహించి.. నియామక పత్రాలు అందించామన్నారు. గ్రూప్ 1, 2 ఉద్యోగుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాలను అమ్ముకున్నామని కోర్టుల్లో లీగల్ లిటిగేషన్ పెట్టారని, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క తప్పు కూడా చేయలేదని అన్నారు. బాగా చదువుకున్న వాళ్లను టీజీపీఎస్సీలో నియమించాం. అన్ని జాగ్రత్తలతో పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించాం. మీరంతా శిక్షణ పూర్తి చేసుకొని ఉద్యోగాల్లో చేరుతున్నారు. ప్రభుత్వం మిమ్మల్నే రాష్ట్ర ప్రతినిధులుగా భావిస్తోంది. మీ ద్వారానే ప్రభుత్వ పథకాలు అమలవుతాయి. మేం ఎన్ని పాలసీలు చేసినా.. దాని అమల్లో మీరే చాలా ముఖ్యం. బాధ్యతాయుతమైన పదవుల్లో చేరుతున్నారు. ఉద్యోగవిరమణ రోజు వరకు ఇదే స్ఫూర్తితో పని చేయాలి' అని దిశానిర్దేశర చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులతోపాటు శిక్షణ పూర్తి చేసుకున్న 271 మంది గ్రూప్-1, 171 మంది గ్రూప్-2 అధికారులు, 51 మంది మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై 100 రోజుల కార్యక్రమాలు

మంత్రులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనేలా కార్యాచరణ

ప్రతీ శాఖ వందరోజుల కార్యాచరణపై ప్రణాళిక

మార్చి 1న జిల్లా కలెక్టర్లతో సిఎం రేవంత్ సమావేశం

అధికారుల సమావేశంలో సిఎస్ రామకృష్ణారావు ఆదేశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం)**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై 100 రోజుల కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణా రావు వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తోపాటు రాష్ట్ర మంత్రులు ప్రజా ప్రతినిధులు పాల్గొనే ఈ వంద రోజుల కార్యక్రమంలో అన్ని శాఖల వారీగా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. డా.బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని సి.ఎస్ నిర్వహించారు. స్పెషల్ సి.ఎస్ లు ..మిగతా 2లో



National Human Rights Commission

కుమ్మెర ఘటన.. పోలీసుల నిర్లక్ష్యంపై

## జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్

నాలుగు వారాల్లో నివేదిక అందించాలని ఆదేశం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం)**

నాగర్‌కర్నూల్‌లో జరిగిన కుల వివక్ష దాడి , పోలీసుల నిర్లక్ష్యంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయ్యింది. ఘటనపై నాలుగు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. న్యాయవాది వినోద్ హిందుస్థానీ దాఖలు చేసిన ఫిర్యాదుపై స్పందిం చిన కమిషన్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, ఎస్పీకి నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై ..మిగతా 2లో



ఇజ్రాయెల్ భారత్ మధ్య

## స్వేచ్ఛా వాణిజ్యం

మైత్రి మరింత బలపడిందన్న మోదీ, నెతన్యాహు

భారత్-ఇజ్రాయెల్ బంధం 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి

ఏఐ, క్వాంటం టెక్నాలజీపై కొత్త ఒప్పందం..

ఇజ్రాయెల్‌లో యూపీఐ సేవలు

ఉగ్రవాదంపై కలిసికట్టుగా పోరాడతామని ఇరు దేశాల స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం)**

భారత్, ఇజ్రాయెల్ మధ్య సంబంధాలు ప్రతి సవాల్‌ను తట్టుకుని కాలపరీక్షకు నిలిచాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పరస్పర విశ్వాసం, ప్రజాస్వామ్య విలువలపై ఏర్పడిన ఈ బంధం ఎంతో బలమైనదని పేర్కొన్నారు. ఇరు దేశాల భాగస్వామ్యాన్ని 'శాంతి, ఆవిష్కరణ, శ్రేయస్సు కోసం ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం'స్థాయికి పెంచుతూ చారిత్రక నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.

జెరూసలేంలో గురువారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో కలిసి నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో మోదీ మాట్లాడారు. అంతకుముందు ఇరు దేశాల మధ్య పలు కీలక అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) జరిగాయి. కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం, క్రిటికల్ మినరల్స్ వంటి రంగాల్లో సహకారాన్ని వేగవంతం చేసేందుకు 'క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ పార్ట్‌నర్‌షిప్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయెల్‌లో యూపీఐ సేవలను వినియోగించేందుకు ఒప్పందం కుదరడం సంతోషంగా ఉందన్నారు.

వ్యవసాయ రంగంలో సహకారానికి సుదీర్ఘ చరిత్ర ఉందని, దీన్ని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని నిర్ణయించామన్నారు. ఇజ్రాయెల్ సహకారంతో భారత్‌లో ఏర్పాటు చేసిన సెంటర్స్ ఆఫ్ ..మిగతా 2లో

# ఇజ్రాయెల్ భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్యం

మొదటి పేజీ తరువాయి...

ఎక్సలెన్స్ విజయవంతం కావడంతో, వాటి సంఖ్యను 100కు పెంచనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి తుది రూపు ఇస్తామని పేర్కొన్నారు. ఉగ్రవాదంపై ఇరు దేశాల వైఖరి స్పష్టంగా ఉందని, దానికి ప్రపంచంలో చోటు లేదని మోదీ స్పష్టం చేశారు. గాజా శాంతి ప్రణాళిక ద్వారా శాంతికి మార్గం ఏర్పడిందని, ఈ ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతు ఇచ్చిందని పునరుద్ఘాటించారు. తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ ఇజ్రాయెల్ చారిత్రక గడ్డపై అడుగుపెట్టడం గర్వంగా, భావోద్వేగంగా ఉందని మోదీ అన్నారు. ఇజ్రాయెల్ పార్లమెంట్ 'క్నెస్సెట్'లో ప్రసంగించే అవకాశం కల్పించినందుకు, స్పీకర్ మెడల్‌తో సత్కరించినందుకు నెతన్యాహుకు, ఇజ్రాయెల్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.



**మోదీ పర్యటన చిన్నదే అయినా అద్భుతం: నెతన్యాహు ప్రశంసలు**

భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటన చిన్నదే అయినప్పటికీ, అది అసాధారణంగా ఫలవంతమైందని, హృదయాలను కదిలించిందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు. గురువారం జెరూసలేంలో ఇరు నేతల మధ్య చర్చల అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు."ఇది ఒక అద్భుతమైన పర్యటన. పర్యటన ముగింపు కూడా అంతే అద్భుతంగా ఉంది. నిన్న ఇజ్రాయెల్ పార్లమెంట్ 'నెస్సెట్'లో మోదీ చేసిన ప్రసంగం అందరి కళ్లను చెమర్చేలా చేసింది" అని నెతన్యాహు ప్రశంసించారు. ఇరు దేశాల్లోని ప్రతిభావంతుల మధ్య సహకారం గురించి చర్చించామని, వాటిని నిర్దిష్ట ప్రణాళికలుగా మారుస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా భారత్‌లో ప్రభుత్వ స్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన ప్రకటించారు. ఇది ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం చాలా సమర్థవంతంగా పనిచేస్తోందని నెతన్యాహు కితాబిచ్చారు. "ఆవిష్కరణలను అందిపుచ్చుకున్న వారికే భవిష్యత్తు ఉంటుంది. భారత్, ఇజ్రాయెల్ గర్వించదగిన ప్రాచీన నాగరికతలు. భవిష్యత్తును అందిపుచ్చుకోవడానికి మేం నిశ్చయించుకున్నాం. కలిసికట్టుగా మరింత అభివృద్ధి సాధించగలం" అని అన్నారు. ప్రెసిషన్ అగ్రికల్చర్, ప్రెసిషన్ ఎడ్యుకేషన్ వంటి రంగాల్లో కలిసి పనిచేయడం ద్వారా ప్రతి ఒక్కరి సామర్థ్యాన్ని వెలికితీయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం బుధవారం ఇజ్రాయెల్ చేరుకున్న ప్రధాని మోదీకి నెతన్యాహు దంపతులు ఘన స్వాగతం పలికారు. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా మోదీ చరిత్ర సృష్టించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో బస్సు సౌకర్యం ఏర్పాటు

మొదటి పేజీ తరువాయి...

ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడొద్దని అన్నారు.

అన్ని సౌకర్యాలు కల్పించాలి : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలలో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు సీఎం సూచనలు చేశారు. బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌లో తప్పని సరిగా పాలు ఉండేలా చూడాలని, ఆ పాలు విజయ డైరీ నుంచి సేకరించాలని అన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత కోసం ఏఐ టెక్నాలజీ వినియోగించాలన్న సీఎం కోర్ అర్బన్ రీజియన్ మినహా మిగిలిన నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కో మండలంలో ఆరుట్ల స్కూల్ తరహాలో రవాణాతో సహా అన్ని సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ట్రాన్స్‌పోర్ట్ కోసం ఎలక్ట్రికల్ బస్‌ల ఏర్పాటుపైన అధ్యయనం చేయాలని సూచించారు. ప్రైవేట్ స్కూల్స్‌లో నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దుతో పాటు రికవరీ చేసేలా నిబంధన విధించాలని ఆదేశించారు. ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణకు సంబంధించి రికమండేషన్లని ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని తెలిపారు.



విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని నివేదిక : తెలంగాణ రాష్ట్ర విద్యావిధానం రాష్ట్ర విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, కమిషన్ సభ్యులు సీఎం రేవంత్ రెడ్డికి నివేదిక సమర్పించారు. అనంతరం ఆకునూరి మురళి మీడియాతో మాట్లాడుతూ 305 స్కూళ్లను సందర్శించామని తెలిపారు. కేవలం పాఠశాల విద్యాలోనే 52 అంశాలతో కూడిన నివేదికను రేవంత్ రెడ్డికి సమర్పించినట్లు చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లతో 46 సమావేశాలు జరిపామని అన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ పెట్టాలని సిఫార్సు చేశామని, విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని నివేదికను రూపొందించామని తెలిపారు.

ప్రభుత్వం పాఠశాలల్లో బస్సు సౌకర్యం ఏర్పాటు : ప్రైవేటు స్కూళ్లలో ఫీజులపై కొన్ని సిఫార్సులు చేశామని, స్కూల్ డిస్ట్రిక్ ఉండాలని కొన్ని సిఫార్సులు చేశామని, ఒకటో తరగతి నుంచి మూడు భాషల విధానం ఉండాలని సిఫార్సు చేశామని ఆకునూరి మురళి అన్నారు. గతంలో ఆరుట్ల స్కూల్‌లో 600 మంది ఉండేవారని, ప్రస్తుతం ఆరుట్ల స్కూల్‌లో 1,600 మంది విద్యార్థులకు పెరిగారని గుర్తు చేశారు. ప్రతి మండలంలో రెండు ప్రభుత్వం పాఠశాలల్లో బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని సీఎం చెప్పారని తెలిపారు.

నర్సరీ నుంచి యూనివర్సిటీ వరకు ఇంగ్లిష్‌లో భోధన : రాష్ట్రంలో విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు 434 సిఫార్సులు చేసినట్లు ఆకునూరి మురళి వెల్లడించారు. ప్రతి మండలంలో సగటున 3 పాఠశాలలు ఉండేలా చర్యలు చేపట్టాలని నివేదించినట్లు తెలిపారు. ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల నియంత్రణకు ప్రత్యేకమైన వ్యవస్థ ఉండాలని సిఫార్సు చేసినట్లు మురళి వివరించారు. నర్సరీ నుంచి యూనివర్సిటీ వరకు ఇంగ్లిష్‌లో భోధన ఉండాలని నివేదికలో పేర్కొన్నట్లు చెప్పారు.

"కేవలం పాఠశాల విద్యాలోనే 52 అంశాలతో కూడిన నివేదికను సీఎం రేవంత్ రెడ్డికి సమర్పించాం. 305 స్కూళ్లను సందర్శించాం. స్కూల్ డిస్ట్రిక్ ఉండాలని కొన్ని సిఫార్సులు చేశాం. ఒకటో తరగతి నుంచి మూడు భాషల విధానం ఉండాలని సిఫార్సు చేశాం. ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల నియంత్రణకు ప్రత్యేకమైన వ్యవస్థ ఉండాలని సిఫార్సు చేశాం." – ఆకునూరి మురళి, తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ ఛైర్మన్

# పేదల ఇళ్లు కూల్చిన దుర్మార్గులు

## తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం

### వెలుగుమట్ల బాధితులను పరామర్శించిన కెటిఆర్

**ఖమ్మం, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం రాజ్యమేలుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో తొలగించిన ఆక్రమణలను కేటీఆర్ పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. వచ్చే నెల16వ తేదీ నుంచి అసెంబ్లీ ప్రారంభ మవుతుందని ఖమ్మం ప్రజల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తామని అన్నారు. మీ అందరికీ న్యాయం జరిగేవరకూ మీ పక్షాన ప్రభుత్వంపై పోరాడతామని చెప్పుకొచ్చారు. తాము అధికారంలోకి రాగానే మీ అందరికీ ఇదే స్థలంలో ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని కేటీఆర్ భరోసా కల్పించారు. అందరూ ధైర్యంగా ఉండాలని అంటూ బాధితులకు కేటీఆర్ మాటిచ్చారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వరకు ఎక్కడ చూసినా కూల్చివేతలేనని ఆరోపించారు. ఖమ్మంలో కూల్చివేసిన కాలనీ చూశానని.. ముగ్గురు మంత్రులకు 60 ఎకరాల మీద కన్నుబడిందని ఆక్షేపించారు. ముగ్గురు మంత్రులు కలిసికట్టుగా ఈ దుర్మార్గం చేశారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎవరికీ తాము అన్యాయం చేయలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. అందరూ ధైర్యంగా ఉండాలని.. మీ అందరికీ అదే ప్రాంతంలో అక్కడే ఇళ్ల స్థలాలు ఇల్లు ఇస్తామని మాటిచ్చారు. ఇక్కడి వారందరికీ అండగా నిలబడాలని తాను వచ్చానని చెప్పుకొచ్చారు. ఇళ్ల కూల్చివేతపై కోర్టుకి కూడా వెళ్లామని.. మీకెవరికీ ఒక రూపాయి ఖర్చు లేకుండా మీ తరఫున తమ లీగల్ టీం పోరాడుతుందని మాజీమంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పేదలు ఎంతో కష్టపడి కట్టుకున్నఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్లతో కూల్చివేస్తున్న సంగతి తెలిసిందే. రేవంత్ సర్కార్ కనికరం లేకుండా ఖమ్మం అర్బన్ వెలుగుమట్ల భూదాన్



భూముల్లో పేదల ఇళ్లను నేలమట్టం చేస్తోంది. ఈ క్రమంలో వారికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులను కలిశారు. ఇళ్లు కోల్పోయిన వెలుగు మట్ట బాధితులను కేటీఆర్, పార్టీ నేతలతో కలిసి పరామర్శించారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మిమ్మల్ని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుస్తరు. మీకు అది చేస్తం.. ఇది చేస్తం.. అది చేస్తమని.. మీ 900 కుటుంబాల్లో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తాడు. మీరు ఐక్యంగా ఉంటేనే విజయం సాధిస్తరు.. లేదంటే వీళ్లు ఏం చేస్తరు. ఏ 100 మందితో వేలి ముద్రలు తీసుకొని మీకు అన్నేన్నో ఇస్తరు.. కేసీఆర్ 2000 డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టించారు. వాటిలో కొన్ని మిగులున్నయట. ఆ ఇండ్లలో కొంతమందికిస్తమని చెప్పి వారిని లాక్కెళతారని కేటీఆర్ హెచ్చరించారు. ఓపీడీఆర్ వాళ్లు గతంలో ఎప్పుడో చేసిన పని. పాపం వాళ్లేం తప్పు చేయలేదు.. మీకు పట్టాలిప్పించారు. వాళ్లు తప్పు చేసిందేమి లేదు.. ఇప్పుడు వాళ్లను పట్టుకుని ప్రభుత్వం నానా మాటలు అంటోంది. ల్యాండ్ మాఫియానట.. ఎవడమ్మా ల్యాండ్ మాఫియా.. ఎవడైతే ఇవాళ మీ చుట్టూ వందల ఎకరాలు కొన్నాడో.. ఎవడైతే పేదవాడి ఇల్లు కట్టుకున్నడో వాడు మాఫియానా..? మీకు జరిగిన కష్టం.. మీ ఏడుపులు రాష్ట్రం మొత్తం చూసింది. మీ పిల్లలు, మీరు పడుతున్న అవస్థలు చూసే కేసీఆర్ సార్ మమ్మల్ని పంపించారు. దయచేసి ధైర్యంగా ఉండండి.. మీకు అన్ని రకాలుగా అండగా అజయ్ అన్న, మా ఎంపీ గాయత్రి రవిచంద్ర ఉంటారన్నారు. ఏ తప్పు జరుగకపోతే ఆర్డీవోను ఎందుకు వెంటనే బదిలీ చేశారు. సమాధానం చెప్పాలే ప్రభుత్వం. మంత్రులు తప్పు చేయకపోతే.. నిజంగా ధైర్యముంటే వాళ్లెందుకు రావడం లేదు.. ఇక్కడికి.. వాళ్లొచ్చి మాట్లాడాలి కదా.. అందుకే మీరు ధైర్యంగా ఉండండి. మీ వెంబడి కేసీఆర్ అన్న ఉన్నడు.. కేటీఆర్ అన్న ఉన్నడు. మేమంతా ఉన్నం. ఎట్టి పరిస్థితుల్లో మీకు న్యాయం జరిగేదాకా మేము అండగా ఉంటామని హామీనిచ్చారు. మీకు అన్ని కాగితాలున్నాయి.. కోర్టుకు పోదాం.. కోర్టుకు కూడా మీరు రూపాయి ఖర్చు పెట్టుకునే పని లేదు. పార్టీ తరపున మేం కొట్లాడుతాం.. మీకు మేం అండగా ఉంటాం. మళ్లీ వస్తాం మిమ్మల్ని కాపాడుకుంటాం. న్యాయపరంగా పట్టాలిప్పించే ప్రయత్నం చేస్తాం. దయచేసి ఐకమత్యాన్ని కోల్పోకండి.. సంఘటితంగా, ఒక్కటిగా ఉండండిని సూచించారు.



# కేవలం కమిషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం

మొదటి పేజీ తరువాయి...

ప్రతిపక్ష సభ్యులు పారిపోయారని దుయ్యబట్టారు. సభలో చర్చకు రమ్మంటే కుంటిసాకులు చెప్పే బావబావమరుదులు బయట మాత్రం అచ్చోసిన ఆంబోతుల్లా రంకెలు వేస్తున్నారని పొంగులేటి ఘాటుగా విమర్శించారు. నిత్యం పెయిడ్ ఆర్టిస్టులతో సోషల్ మీడియాలో విషం చిమ్ముతూ, శవాల మీద చిల్లర ఏరుకునే రకంగా ప్రతిపక్షం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రజలు వీరి నిజస్వరూపాన్ని చూశారు కాబట్టే అన్ని ఎన్నికల్లో ఓడగొట్టారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీ పడదని మంత్రి స్పష్టం చేశారు. కృష్ణా పరివాహక ప్రాంత నీటిని నల్గొండ, ఖమ్మం, మహబూబ్ నగర్ వాసులకు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ స్వార్థ నిర్ణయాల వల్ల రాష్ట్రం 15 ఏళ్లు వెనక్కి పోయిందని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాన్ని మరో 15 ఏళ్లు ముందుకు తీసుకెళ్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల పనులపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రతిపక్షం దమ్ముంటే అసెంబ్లీకి రావాలని ఆయన సవాల్ విసిరారు.



# రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై 100 రోజుల కార్యక్రమాలు

మొదటి పేజీ తరువాయి...

జయేష్ రంజన్, వికాస్ రాజ్ ,సి.వీ ఆనంద్ , సంజయ్ కుమార్ , మహేష్ దత్ ఎక్కా, సబ్యసాచి ఘోష్, నవీన్ మిట్టల్, దాన కిషోర్, అహ్మద్ నదీమ్, తదితరులు హాజరైన ఈ సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, ఈ వంద రోజుల కార్యక్రమంపై ఈ నెల 28వ తేదీన నిర్వహించే కార్యదర్శుల సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరవుతారని తెలిపారు. అదేవిధంగా మార్చ్ 1వ తేదీ ఆదివారం నాడు జిల్లా కలెక్టర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మార్చి 2వ తేదీ నుండి జూన్ 9 వ తేదీ వరకు వివిధ అభివృద్ధి పనులపై ప్రతీ శాఖ తమ 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని, జిల్లా కలెక్టర్ల సమావేశంలో చర్చనీయాంశాలు వెంటనే రూపొందించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ముఖ్యమంత్రి తో పాటు రాష్ట్ర మంత్రులు ప్రారంభిస్తారని ఇందుకు గాను ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ప్రభుత్వ భవనాలను సిద్ధం చేయాలనీ అన్నారు. ప్రధానంగా గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, హెల్త్, ఎడ్యుకేషన్, పంచాయితీ రాజ్, వ్యవసాయం, రెవెన్యూ, పర్యాటక, పరిశ్రమలు, మహిళా శిశు సంక్షేమం, గృహనిర్మాణం, రెవెన్యూ, విద్యుత్, కార్మిక తదితర అన్ని శాఖలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సి.ఎస్ పేర్కొన్నారు. ముఖ్యంగా, పారిశుధ్యం గ్రామీణాభివృద్ధి ఆరోగ్య తదితర కార్యక్రమాలపై నూతనంగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ ఛైర్మన్లకు అవగాహన చైతన్య కార్యక్రమాల మాదిరిగా కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. సచివాలయం తోపాటు హెచ్.ఓ.డి లలో ఈ–ఆఫీస్ ను అమలు చేయాలని ఆదేశించారు.

## కుమ్మెర ఘటన.. పోలీసుల నిర్లక్ష్యంపై

# జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్

మొదటి పేజీ తరువాయి...

తీసుకున్న చర్యల నివేదికను నాలుగు వారాల్లోగా సమర్పించాలని ఆదేశించింది. ఈనెల 18న కుమ్మెర మల్లన్న స్వామి జాతర సందర్భంగా చిలుకేశ్వరం చంద్రకళ కుటుంబాన్ని ఆలయంలోకి ప్రవేశాన్ని నిరాకరించడంతో పాటు రెండు నెలల పసికందును ఉద్దేశపూర్వకంగా తొక్కడంతో ఆ శిశువు మరణించింది. నిందితులపై చర్యలు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులు నిర్లక్ష్యం వహించడాన్ని తప్పుపడుతూ న్యాయవాది కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితులు నాగర్‌కర్నూల్ పోలీసు స్టేషన్‌కు వెళ్లినప్పుడు, నిందితులకు ఉన్న రాజకీయ పలుకుబడి కారణంగా ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయడానికి అధికారులు నిరాకరించారని ఆరోపించారు. పోలీసులు రాజ్యాంగ రక్షణలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను సైతం ఉల్లంఘించారని కమిషన్ గుర్తించిందన్నారు. నిందితులను అరెస్టు చేయడం, విధి నిర్వహణలో విఫలమైన పోలీసు అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, బాధితులకు రక్షణతో పాటు పరిహారం అందించాలని కమిషన్ పేర్కొందని వివరించారు.. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు న్యాయం జరిగే ప్రక్రియలో రాజకీయ పలుకుబడి అడ్డంకి కాకూడదని నిర్ధారించడానికి కమిషన్ జోక్యం ఒక కీలక ముందడుగు అన్ని వినోద్ హిందుస్థానీ పేర్కొన్నారు

## రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా
# మంద మకరందు బాధ్యతల స్వీకరణ


రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరిస్తున్న మంద మకరందు


రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ మంద మకరందు కు పుష్ప గుచ్ఛం అందచేసి స్వాగతం పలుకుతున్న అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వి సమ్మయ్య


రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ మంద మకరందు కు పుష్ప గుచ్ఛం అందచేస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి సురేందర్ రెడ్డి

**బుద్వేల్, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం)**


రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ గా 2020 బ్యాచ్ కు చెందిన ఐఏఎస్ అధికారి మంద మకరందు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సీసీఎల్ఏ లోని చీఫ్ మినిస్టర్స్ రిలీఫ్ ఆపరేషన్స్ ప్రాజెక్టు డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న మంద మకరందు ను రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ గా నియమిస్తు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన వెంటనే బుద్వేల్ లో గల రాజేంద్రనగర్ జోనల్ కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. జోనల్ కమిషనర్ మంద మకరందు కు అత్తాపూర్, రాజేంద్రనగర్ సర్కిల్ ల డిప్యూటీ కమిషనర్లు వి సమ్మయ్య. బి సురేందర్ రెడ్డి లు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు.

**జోన్ పరిధి ని అధికారులతో కలసి పరిశీలించిన జోనల్ కమిషనర్ :**

రాజేంద్రనగర్ జోన్ పరిధి ని అధికారులతో కలసి జోనల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన మంద మకరందు పరిశీలించారు. జోన్ పరిధిలోకి వచ్చే బార్డర్ లను ఆయన పరిశీలించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, అభివృద్ధి పనులను కూడా వేగవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. సమయం ప్రకారం ప్రజలకు సేవలందించాలన్నారు.

**62 రోజులకే బదిలీ అయిన జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి :**

డిసెంబరు 26వ తేదీన రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన అనురాగ్ జయంతి ఫిబ్రవరి 26న అంటే 62 రోజులకే బదిలీ అయ్యారు. ఆయనను యాదాద్రి జిల్లా కలెక్టర్ గా బదిలీ చేస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జోనల్ కమిషనగర్ గా బాధ్యతలు స్వీకరిం చిన అనురాగ్ జయంతి ప్రస్తుతం అత్తాపూర్ సర్కిల్ కార్యాలయం గా కొనసాగుతున్న కార్యాలయం పై అంతస్థులో జోనల్ కార్యాలయం పునః నిర్మించడానికి పనులు చేపట్టారు. అత్తాపూర్ సర్కిల్ లో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేస్తున్న స్వచ్ఛ ఆటోలు చెత్తను సేకరిస్తున్నాయా లేదా అని తెలుసుకుని మెరుగైన పద్దతిలో చెత్తను సేకరించడానికి ప్రతి ఇంటికి క్యూ ఆర్ కోడ్ ను అతికిం చే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ పైలట్ ప్రాజెక్టు ను అత్తాపూర్ సర్కిల్ లోని హైదర్ గూడ డివిజన్ లో ప్రారంభించారు. ఆ పనులను కొత్త జోనల్ కమిషనర్ మంద మకరందు కొనసాగిస్తారా లేదా చూడాల్సి ఉంది.


మొక్కల ఆరోగ్యం, నిర్వహణ కు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

## మొక్కల ఆరోగ్యం, నిర్వాహణపై
## మరిన్ని పరిశోధనలు అవసరం

**బుద్వేల్, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం)**

మొక్కల ఆరోగ్యం, వ్యవసాయ ఎగుమతుల రంగం లో ఎదురౌతున్న సవాళ్లను అధిగమించడానికి శాస్త్రవేత్తలు కృషి చేయాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్) అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (ప్లాంట్ ప్రొటెక్షన్) డాక్టర్ పూనమ్ జస్రోటియ అన్నారు. రాజేంద్రనగర్ లోని నేషనల్ ప్లాంట్ హెల్త్ మేనేజ్మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం) లో మూడు రోజుల పాటు జరుగనున్న స్థితిస్థాపక వ్యవసాయం, వ్యవసాయ ఎగుమతి ప్రోత్సాహం, మొక్కల ఆరోగ్య నిర్వాహణ లో ఆవిష్కరణలు అనే అంశంపై గురువారం జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సు లో పాల్గొన్న డాక్టర్ పూనమ్ జస్రోటియ మాట్లాడుతూ, ఆరోగ్య నిర్వాహణ లో నూతన పరిశోధనలు అవసరం అన్నారు. భారత ప్రభుత్వ ప్లాంట్ ప్రొటక్షన్ అడ్వయిజరు డాక్టర్ జె పి సింగ్ మాట్లాడుతూ, మొక్కలలో వ్యాప్తి చెందే పురుగుల గుర్తింపు, నిర్వాహణ లో రిమోట్ డయాగ్నస్టిక్ సాధనాల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ఇంఫాల్ లోని సీఏయు మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్ ఎన్ పూరి, ఎన్ఐపీహెచ్ఎం డైరెక్టర్ డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్, డాక్టర్ శరత్ బాబు, డాక్టర్ సచిన్ ఎస్ సురేషి, డాక్టర్ ఎ కె ధావన్, జివి రమణారెడ్డి లు పాల్గొన్నారు.



రోడ్డు నిబంధనల గురించి దుర్గానగర్ లో ఉన్న ఓ దుకాణం లో పని చేస్తున్న సిబ్బందికి వివరిస్తున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు

## వాహనదారులు
## రోడ్డు నిబంధనలను పాటించాలి

**బుద్వేల్, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం)**

ఆరైవ్.. ఆలైవ్ అనే కార్యక్రమంలో బాగంగా రాజేం ద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు గురువారం దుర్గానగర్ చౌరస్తా లోని ఓ దుకాణం వద్ద రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించారు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ సీహెచ్ రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణకు మహిళలు, మహిళా సం ఘాల సభ్యులు తమ కుటుంబ సభ్యులకు, తాము నివాసం ఉంటున్న ప్రాంతాలలో అవగాహన కల్పించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడపవద్దని వాహనదారులకు చె ప్పాలన్నారు. అతి వేగంతో వాహనాలను నడపకూడదని సూచించాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని, కారు నడిపే సమయంలో సీటు బెల్టు పెట్టుకోవాలని అవగాహన కల్పించాలని సూచించారు. తమకు సూచించిన మార్గంలోనే వాహనాలను నడపాలని, ఓవర్ టేక్ చేయవద్దని సూచనలు చేశారు. దుకాణంలో ఉన్న మహిళలు, పురుషులు ఈ నిబంధనలను పాటించాలని, మిగతా వారికి కూడా చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజేం ద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న సుధా విద్యార్థినిల నృత్య ప్రదర్శన






**పాలకుర్తి ఫిబ్రవరి 26(ప్రభాత ఉదయం):**

పాలకుర్తి మండలంలోని దర్దేపల్లి గ్రామంలో మొన్న నిర్వహించిన ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాల సందర్భంగా అద్భుతమైన నృత్యాల ద్వారా ఆకట్టుకున్నందుకు సుధా టెక్నో విద్యార్థులను శివాజి యువసేన దర్దేపల్లి అధ్యక్షులు వేణు అభినందించి ఉత్తమ బహుమతి అందచేశారు. శివాజి జయంతి ఉత్సవాలను అద్భుతంగా నిర్వహించి నందుకు గాను కమిటీ సభ్యులను అభినందిస్తూ వేణుకి స్కూల్ తరుపున పాఠశాల ప్రిన్సిపాల్ రాపాక విజయ్ కుమార్ సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ద్వజస్థంభ ప్రారంభోత్సవ వేడుకలో ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గం, మూసాపేట్ గూడ్స్ షెడ్ రోడ్ లో శ్రీశ్రీశ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయ ద్వజస్థంభ ప్రారంభోత్సవానికి జనసేన నాయకులు పండుగ సూర్య, పండుగ కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు జనసేన పార్టీ కూకట్‌పల్లి ఇంచార్జి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నందగిరి సతీష్, బొర్రా వెంకట్ అప్పారావు, కొల్లా శంకర్, వేముల మహేష్, కిషోర్ నాగరాజు, మండలి అనిల్,బడే విశ్వేశ్వర్ రావు, కలిగినీడి ప్రసాద్, పోలేబోయిన శ్రీనివాస్, చిట్టి బాబు, ప్రభుచైతన్య, రణదీప్, సుదర్శన్, రాము, మురళి, పులగం సుబ్బు, అప్పారావు, మాధవి, ప్రదీప్, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.



పిల్లర్ నెంబర్ 209 వద్ద అనుమతులు లేని నిర్మాణం

## పిల్లర్ నెంబర్ 209 వద్ద అక్రమ నిర్మాణం
# ప్రారంభానికి సిద్ధం

**బుద్వేల్, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం)**

అత్తాపూర్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరం దుకున్నాయి. సర్కిళ్ల విభజన, అధికారుల బదిలీలు, బాధ్యతల స్వీకరణ లతో బిజీగా ఉంటే అక్రమణ దారులు మాత్రం తమ పనులను చకచకా కొనసాగిస్తున్నారు. చింతల్మెంట్ నుంచి పీడీపీ చౌరస్తా వైపు వెళ్లే మార్గంలో పిల్లర్ నెంబర్ 209 వద్ద ప్రధాన రహదారిలో ఓ వ్యాపారి భారీ షెడ్డును అనధికారికంగా నిర్మిస్తున్నాడు. రోడ్డు పక్కన నిర్మిస్తున్న ఈ షెడ్డుకు ఇప్పటి వరకు అనుమతులు లేవు. సదరు నిర్మాణదారుడు అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నాడని అధికారులు చెబుతున్నారు. నిర్మాణ అనుమతులు వచ్చాకే నిర్మాణ దారులు పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికి అత్తాపూర్ సర్కిల్ లో వాటిని పట్టించుకోకుండ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ సర్కిల్ లో అధికారులు అందరు కొత్త వారే కావడం తో నిర్మాణదారులపై చర్యలు తీసుకోలేకపోతున్నారు. అత్తాపూర్ నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు ప్రధాన రహదారిలో నిర్మాణాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్తగా వచ్చిన జోనల్ కమిషనర్ అయినా స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**నోటీసులు ఇచ్చాం : వి సమ్మయ్య, డిప్యూటీ కమిషనర్, అత్తాపూర్ సర్కిల్**

పిల్లర్ నెంబర్ 209 వద్ద నిర్మిస్తున్న షెడ్డు కు అనుమతులు లేవు. మీ దగ్గర ఎలాంటి అనుమతులు ఉన్నాయి తెలుపాలని నిర్మాణదారునికి నోటీలసులు ఇచ్చాం. సరైన సమాదానం రాకపోతే చర్యలు తీసుకుంటాం.



తమిళ గాంధీ నల్ల కన్ను చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు పుస్తకాల నర్సింగ్, కన్యాగారి నరసింహ రెడ్డి

## తమిళ గాంధీ నల్లకన్నుకు నివాళులు

**బుద్వేల్, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం)**

స్వాతంత్ర్య సమర యోధులు, సీనియర్ కమ్యూనిస్టు పార్టీ నాయకులు, 101 సంవత్సరాలు జీవించిన తమిళ గాంధీ గా పేరు సంపాదిం చిన నల్లకన్ను గురువారం మరణించారు. ఆయన మరణం దేశంలో నివసిస్తున్న అట్టడుగు వర్గాల ప్రజలకు తీరని లోటన్నారు. బుద్వేల్ లోని సీపీఐ రాజేంద్రనగర్ మండల కార్యాలయంలో గురువారం తమిళ గాంధీ నల్లకన్ను చిత్రపటానికి నివాలులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ రం గారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్రావు, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మరెడ్డి, కన్యగారి లక్ష్మీ, కె వాణి, జి. సత్యం, పాండు, కె ఎన్ చారి, సుధాకర్, శ్రీను, శంకర్, రాజు, మహేందర్, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులు అమర్ ను సన్మానిస్తున్న విద్యార్థులు,ఉపాధ్యాయులు

## ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు అర్హత సాదించిన 9మంది విద్యార్థులు

**బుద్వేల్, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం):**

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎం ఎంఎస్) కు శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 9 మంది విద్యార్థులు అర్హత × సాధించారు. ఈ స్కాలర్షిప్ ద్వారా 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుకునే సమయంలో సంవత్సరానికి రూ.12వేల చొప్పున, నెలకు రూ.1000 లు ఆర్థిక సహాయం చేసారు. ఇటీవల నిర్వహించిన పరీక్షలో శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తొమ్మిది మంది ఈ స్కాలర్షిప్ కు అర్హత సాదించారు. విద్యార్థులకు తర్ఫీదు నిచ్చిన ఉ పాధ్యాయులు అమర్ ను గురువారం సన్మానించారు.

## జనగామ జిల్లా నూతన కలెక్టర్‌గా సందీప్ కుమార్ ఝా బాధ్యతల స్వీకరణ

### జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రిజ్వాన్ బాషా షేక్ బదిలీ

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26(ప్రభాత ఉదయం):**





తెలంగాణ రాష్ట్రము లో భారీగా ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. అందులో భాగంగా జనగామ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రిజ్వాన్ బాషా షేక్ గద్వాల జిల్లా కలెక్టర్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జీహెచ్ఎంసీ, కుత్బుల్లాపూర్, జోనల్ కమిషనర్ (2014 కేడర్ ఐఏఎస్ అధికారి) సందీప్ కుమార్ ఝా నూతన కలెక్టర్‌గా నియమితుల య్యారు. జనగామ జిల్లా కలెక్టర్ గా సందీప్ కుమార్ ఝా గురువారం మధ్యాహ్నం బాధ్యతలను స్వీకరించారు.

# గచ్చిబౌలి ఐటీ కారిడార్‌కు మహర్దశ

## ట్రిపుల్ ఐటీ జంక్షన్ వద్ద సిగ్నల్ రహిత ప్రయాణం!







**శేరిలింగంపల్లి : ఫిబ్రవరి 26, (ప్రభాత ఉదయం )**

హైదరాబాద్‌లోని ఐటీ గుండెకాయ గచ్చిబౌలిలో ట్రాఫిక్ నరకానికి కాలం చెల్లనుంది. ప్రతిష్టాత్మకమైన ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టులో భాగంగా ట్రిపుల్ ఐటీ చౌరస్తా వద్ద నిర్మిస్తున్న అండర్ పాస్, మూడు అంచెల ఫ్లైఓవర్ల నిర్మాణంతో ఈ ప్రాంతం అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులకు వేదిక కాబోతోంది.నిత్యం ట్రాఫిక్ నరకం పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మణికొండ ప్రాంతాలకు ప్రధాన కూడలి అయిన ట్రిపుల్ ఐటీ జంక్షన్ వద్ద వేలాది వాహనాలు నిలిచిపోయి నిత్యం కిలో మీటరు దూరం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. పీక్ అవర్స్‌లో విప్రో సర్కిల్ నుండి గచ్చిబౌలి వరకు, అటు లింగంపల్లి నుండి డిఎల్ఎఫ్ వరకు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ కావడం ఐటీ ఉద్యోగులకు, స్థానిక ప్రజలకు నిత్యకృత్యమైంది. ఈ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రభుత్వం ఒకే జంక్షన్ వద్ద నాలుగు ప్రధాన నిర్మాణాలను చేపట్టింది.

**ప్రాజెక్ట్ ముఖ్యాంశాలు: నాలుగు అంచెల వ్యూహం**

ట్రిపుల్ ఐటీ చౌరస్తాను పూర్తిస్థాయిలో 'సిగ్నల్ ఫ్రీ' జోన్‌గా మార్చేందుకు ఇంజనీర్లు అద్భుతమైన డిజైన్‌ను రూపొందించారు.

ఆరు లైన్ల భారీ అండర పాస్ లింగంపల్లి నుండి గచ్చిబౌలి వైపు వెళ్లే వారికి, తిరుగు ప్రయాణంలో గచ్చిబౌలి నుండి లింగంపల్లి వెళ్లే వారికి ఇది ఊరటనివ్వనుంది.

**6 లైన్లు ద్విపాక్షిక ప్రయాణం**

ట్రిపుల్ ఐటి జంక్షన్ వద్ద ఆగాల్సిన అవసరం లేకుండా వాహనాలు నేరుగా భూగర్భ మార్గం ద్వారా వెళ్ళిపోవచ్చు. ఈ ప్రాంతంలో నిత్యం అత్యంత రద్దీగా ఉండే మార్గం 2. లెవల్ మొదటి ఫ్లైఓవర్ విప్రో నుండి డీఎల్ ఎఫ్ వరకు అంటే ఐటీ కారిడార్‌లోని రెండు ప్రధాన హబ్‌లను కలిపేలా ఈ ఫ్లైఓవర్ నిర్మితమవుతోంది.

4 లైన్లు. విప్రో జంక్షన్ నుండి డిఎల్ఎఫ్ వైపుకు, తిరిగి డిఎల్ఎఫ్ నుండి విప్రో వైపుకు రెండు వైపులా వాహనాల రాకపోకలు ఉంటాయి. లెవల్-2 అర్ధచంద్రాకార ఫ్లైఓవర్ విప్రో టు ఇంద్రానగర్

విప్రో జంక్షన్ వైపు నుండి వచ్చే వాహనాలు గచ్చిబౌలి (ఇంద్రానగర్) వైపు మళ్లడానికి ఇది ప్రత్యేకంగా రూపొందించబడింది.

**3 లైన్లు సెమీ-సర్క్యులర్ (అర్ధచంద్రాకారం)**

గచ్చిబౌలి వైపు వెళ్లే ట్రాఫిక్‌ను జంక్షన్ వద్ద ఆపకుండా గాల్లోనే మళ్లించడం. లెవల్-2 మరో అర్ధచంద్రాకార ఫ్లైఓవర్ డీఎల్ ఎఫ్ నుండి లింగంపల్లి.

డిఎల్ఎఫ్ వైపు నుంచి లింగంపల్లి వెళ్లాలనుకునే వాహనదారుల కోసం ఈ ప్రత్యేక ఫ్లైఓవర్ అందుబాటులోకి రానుంది.

3 లైన్లు. ట్రిబుల్ ఐటి జంక్షన్ వద్ద రద్దీని తగ్గించి లింగంపల్లి వైపు వెళ్లే వాహనాలకు సాఫీ మార్గాన్ని కల్పిస్తుంది.

**రెండేళ్ల నిరీక్షణ తప్పదు కానీ భవిష్యత్తు సుఖమయం**

ప్రస్తుతం ఈ పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. భారీ పిల్లర్ల నిర్మాణం, గార్డర్ల అమరిక వంటి పనులు ట్రాఫిక్ మధ్యే నిర్వహించడం సవాలుగా మారింది.

సమయ పరిమితి : పనుల వేగం దృష్ట్యా ఈ ప్రాజెక్ట్ పూర్తి కావడానికి మరో రెండు సంవత్సరాల సమయం పట్టే అవకాశం ఉంది.

ప్రస్తుత ఇబ్బందులు నిర్మాణం జరుగుతున్న సమయంలో రహదారులు ఇరుకుగా మారడం, డైవర్షన్ల వల్ల ప్రయాణ సమయం పెరుగుతోంది. వాహనదారులు మరికొంత కాలం ఓపిక పట్టక తప్పదు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే గచ్చిబౌలి జంక్షన్ కేవలం ట్రాఫిక్ ఫ్రీ కావడమే కాదు గ్లోబల్ సిటీగా హైదరాబాద్ కీర్తి కిరీటంలో మరో మైలురాయిగా నిలుస్తుంది. గంటకు వేల సంఖ్యలో వాహనాలు ప్రయాణించే సామర్థ్యం ఈ మల్టీ-లెవల్ స్ట్రక్చర్స్‌కు ఉంటుంది.

ట్రిపుల్ ఐటీ చౌరస్తా వద్ద జరుగుతున్న ఈ భారీ మార్పు ఐటీ కారిడార్ భవిష్యత్తు ముఖచిత్రాన్ని మార్చేయనుంది. ప్రయాణ సమయం తగ్గడం వల్ల ఇంధనం ఆదా అవ్వడమే కాకుండా కాలుష్యం కూడా గణనీయంగా తగ్గుతుంది. రెండేళ్ల తర్వాత గచ్చిబౌలిలో ప్రయాణం ఒక 'స్మూత్ రైడ్'లా మారబోతోందని నిపుణులు అంచనా వేస్తున్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన సీనియర్ నాయకులు మూలమల్ల భీమిరెడ్డి

**కొత్తకోట, ఫిబ్రవరి 26(ప్రభాత ఉదయం)**

వనపర్తి జిల్లా మధనాపురశీ మండలం గాయత్రి, గోపి స్వామి ల కుమారుడు సాయి మిత్ర వివాహం హైదరాబాద్ కు చెందిన హైమావతి , మాణిక్ ప్రభు ల కూతురు శ్రీకరి తో స్వాగత్ గ్రాండ్ కన్వెన్షన్ లో జిల్లెల గూడ (హైదరాబాద్) ల వివాహం ఘనంగా జరిగింది . ఈ కార్యక్రమంలో హైద్రాబాద్ కు చెందిన ప్రముఖ వినాయక ఉత్సవ కమిటీ నాయకులు డాక్టర్ భగవంతు రావు ,బి రాజవర్ధన్ రెడ్డి హై కోర్టు అడ్వకేట్ వనపర్తి జిల్లా సీనియర్ నాయకులు మూలమల్ల భీమ్ రెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి, జి ధర్మారెడ్డి అడ్వకేట్ ల వధువు వరులకు కుటుంబ సభ్యులకు శుభా కాంక్షలు తెలిపి ఆశీర్వదించారు





# అర్హులైన ప్రతి పేదవాడికి గృహ వసతి కల్పిస్తాం: ఎమ్మెల్యే జిఎంఆర్

## జోరుగా ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు

**కొత్తకోట, ఫిబ్రవరి 26(ప్రభాత ఉదయం)**

అర్హులైన ప్రతి పేదవాడికి గృహ వసతి కల్పిస్తుందని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. కొత్తకోట మండలం చర్లపల్లి గ్రామంలో రాధ సీతారాములు గౌడ్ , ఎరుకలి మణెమ్మ మశన్న ల ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే .జి. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.సొంతింటి కల నెరవేర్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి, ఎమ్మెల్యే జియంఆర్ కి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు రుణపడి ఉంటామని ధన్యవాదాలు తెలియజేశారు.అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ...పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇండ్ల లక్ష్యమని అన్నారు, గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో మోసం చేసిందన్నారు.గత ప్రభుత్వంలో చర్లపల్లి గ్రామంలో ఒక డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మొదటి విడతలో 3500 ఇండ్లు మంజూరు చేశామని, ఇప్పటికీ నియోజకవర్గంలో 70% ఇండ్ల నిర్మాణాలను పూర్తయ్యాయని, వచ్చే ఏప్రిల్ నెలలో రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని, ఇల్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు నూతన వస్త్రాలను (బట్టలు) అందజేసిన ఎమ్మెల్యే జియంఆర్ అందజేశారు.





## రామకృష్ణాపురం శివాలయంలో శివుడికి అభిషేకం

**కొత్తకోట, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం)**

మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో శిథిలావస్థలో ఉన్న శివాలయం అభిషేకం కార్యక్రమాలు గ్రామస్తులు నిర్వహించారు. అనంతరం గణపతి నందీశుడు శివుని ఉద్వాసన కార్యక్రమం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.




## ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సహకారంతో.... ఎమ్మెల్యే,ఎంపీ చేతుల మీదుగా కంప్యూటర్ల బహుకరణ

### ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎంతో ఉపయోగం

**పాలకుర్తి, ఫిబ్రవరి 26(ప్రభాత ఉదయం):**

పాలకుర్తి మండల విద్యావ్యవస్థలో నేడు ఒక స్వర్ణ అక్షర లిఖిత ఘట్టం ఆవిష్కృతమైంది. మాతృభూమిపై మమకారంతో, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రేపటి ఉజ్వల భవిష్యత్తు కోసం ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రాపాక స్వాతి, సి ఎస్ ఆర్ కోఆర్డినేటర్ నాగరాజు దంపతులు తమ ఉదారతను చాటుకున్నారు. వారి సౌజన్యంతో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 50 కంప్యూటర్లను విరాళంగా అందజేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి , ఎంపీ కడియం కావ్య, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు కంప్యూటర్లను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని, నేడు అంతర్జాతీయ స్థాయి సంస్థల్లో అత్యున్నత పదవుల్లో ఉన్న వ్యక్తులు, తిరిగి తమ చదువుల తల్లి రుణం తీర్చుకోవడం ఎంతో గర్వకారణం. నేటి డిజిటల్ యుగంలో ఈ 50 కంప్యూటర్లు మన మండల విద్యార్థులను ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దుతాయని కొనియాడారు. ఒకేసారి మండలంలోని అన్ని పాఠశాలలకు ఇంత పెద్ద ఎత్తున కంప్యూటర్లు అందడంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. విద్యా వికాసానికి తోడ్పడిన రాపాక స్వాతి-నాగరాజు దంపతుల సేవా దృక్పథాన్ని కొనియాడుతూ వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న మండల విద్యాశాఖ అధికారి పోతుగంటి నరసయ్య ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిదురాల శ్రీనివాస్ పాలకుర్తి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాయం శోభారాణి చెన్నూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రమేష్ ముత్తారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బుసరాజు అంజయ్య ఉపాధ్యాయులు శ్రీనివాస్ మునిగాల శ్రీనివాస్ విజయేందర్ ఎంఆర్సి సిబ్బంది తాడూరు రమేష్ కిషన్ సరేష్ అరుణ ఇందిరా మల్లేష్ మల్లికాంబ ప్రజా ప్రతినిధులు, మరియు గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



రైతు మంతపురి యాదగిరి ఆవేదన వ్యక్తం చేస్తున్న దృశ్యం

## కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్ బదిలీ అయ్యారని తెలుసుని రైతు ఆవేదన

### కన్నీరు పెట్టుకున్న ఆదర్శ రైతు మంతపురి యాదగిరి

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26(ప్రభాత ఉదయం):**

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం బదిలీ అయ్యారని తెలుసుకొన్న ఆదర్శ రైతు మంతపురి యాదగిరి కలెక్టరేట్ కి వచ్చి...మంచి సార్ , రైతు బాధలు తెలిసిన వ్యక్తి ..బదిలీ కావడం బాధగా ఉందని,..కలెక్టర్ తో తమ బాధ ను వ్యక్తం చేస్తూ కన్నీరు పెట్టుకున్నారు.

## బదిలీపై జోగులాంబ గద్వాల్ జిల్లాకి వెళ్తున్న

# జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ జిల్లా పేరును జాతీయ స్థాయికి తీసుకెళ్లిన కలెక్టర్**

**జిల్లా అభివృద్ధిలో తనదైన మార్క్**

**విద్య, వైద్యం మీద ప్రత్యేక దృష్టి**

**నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు నిరంతరం తపన**



**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం):**

జనగామ జిల్లా కలెక్టర్ గా రిజ్వాన్ బాషా షేక్‌లి రెండేళ్లు పూర్తి చేసుకొని..జోగులాంబ గద్వాల జిల్లాకు కలెక్టర్ గా బదిలీ అయిన సందర్భంగా. జిల్లాలో సంక్షేమ పథకాల అమలులో కలెక్టర్ అందించిన విశేష సేవలు, అందుకున్న పురస్కారాలు

"మన జిల్లా - మన నీరు" అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టి వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేశారు.

ఈ క్రమంలో నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా 2025, నవంబర్ 18న ఢిల్లీలో జరిగిన 6వ జాతీయ జల అవార్డుల కార్యక్రమంలో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీ. ఆర్. పాటిల్ నుంచి ఢిల్లీలో జల్ సంచాయ్ - జన్ భాగీధారీ 1.0 అవార్డు, అలాగే జల్ ప్రహరీ సమ్మాన్ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్నారు.

అదే విధంగా సమాచార హక్కు చట్టం దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, అమలులో ప్రతిభ చూపినందుకు గాను 2025, అక్టోబర్ 9న హైదరాబాదులోని రవీంద్ర భారతిలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఉత్తమ జిల్లా అవార్డును పొందారు.

అలాగే ఎన్నికల ప్రక్రియలో కీలక పాత్ర వహించే ఎన్నికల అధికారులు, సహాయక అధికారులు, పోలింగ్ సిబ్బంది, పరిశీలకులకు, ఎన్నికల నిబంధనలు, విధివిధానాలపై స్పష్టమైన అవగాహన కల్పించి, సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా ఎన్నికల నిర్వహణను అధికారులు సక్రమంగా, పారదర్శకంగా నిర్వహించినందుకు గాను 16వ జాతీయ ఓటర్ల దినత్సవాన్ని పురస్కరించుకొని 2026, జనవరి 25న హైదరాబాదులోని రవీంద్ర భారతిలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఉత్తమ జిల్లాగా పురస్కారాన్ని పొందారు.

అదే విధంగా జాతీయ స్థాయి ఎన్ఏఎస్ - 2024లో తృతీయ తరగతిలో 16వ స్థానం, ఆరవ తరగతిలో 35వ స్థానం, 9వ తరగతిలో 33వ స్థానం సాధించి, దేశవ్యాప్తంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో కేవలం జనగామ జిల్లా విశిష్ట స్థానం సంపాదించినందుకు గాను 2025, సెప్టెంబర్ 5వ తేదీన గురుపూజోత్సవం సందర్భంగా హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలను జిల్లాలోని నిరుపేదలకు అందించేందుకు... నిరంతరం పర్యటనలు, సమీక్ష లతో....జనగాం జిల్లా ను రాష్ట్ర, జాతీయ స్థాయి లో వివిధ అంశాల్లో ముందంజ లో నిలబడేలా చేసిన కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కి ప్రజాప్రతినిధులు, అధికారులు ధన్యవాదములు తెలిపారు.

జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కి అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

## యువత సంఘ్ ఆదర్శాలను అనుసరించి

# సమాజ సేవలో ముందుండాలి

**వడ్డేపల్లి రాజేశ్వరరావు**

**కూకట్‌పల్లి, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం)**



రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటూ మాతృభూమికి సేవ చేస్తూ సాగించిన సంఘ్ ప్రయాణాన్ని ఆవిష్కరించే 'శతక్' చలనచిత్రాన్ని కూకట్ పల్లి నియోజకవర్గ స్వయం సేవకులు, బిజెపి కార్యకర్తల కోసం ప్రత్యేక ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక షోను కూకట్ పల్లి 'వై' జంక్షన్‌లోని "లేక్ షోర్ మాల్" లో వడ్డేపల్లి రాజేశ్వరరావు సౌజన్యంతో ప్రదర్శించారు. రాజేశ్వరరావు నియోజకవర్గంలోని సంఘ సేవకులు, పార్టీ కార్యకర్తలతో కలిసి ఈ చిత్రాన్ని వీక్షించారు. కార్యక్రమం ముగింపులో అందరూ కలిసి సమిష్టిగా "నమస్తే సదా వత్సలే " అంటూ ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ దేశభక్తి, వ్యక్తిత్వ వికాసం, సామాజిక సేవకు అంకితభావంతో శతాబ్ద కాలంగా నిరంతరం సేవలందిస్తోందని అన్నారు. "వ్యక్తి వికాసం నుంచి దేశ వికాసం" అనే లక్ష్యంతో సంఘ్ చేసిన కృషి దేశ సమగ్రత, సంస్కృతి పరిరక్షణకు ఎంతో దోహదపడిందని పేర్కొన్నారు. యువత సంఘ్ ఆదర్శాలను అనుసరించి సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ మాధవరం కాంతారావు, కూకట్ పల్లి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సేవకులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## జనగామ జిల్లా కేంద్రంలో జ్యూట్ బ్యాగ్ తయారీపై


# శిక్షణ పొందిన వారికీ సర్టిఫికేట్ల పంపిణీ

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం):**



శిక్షణ పూర్తి చేసుకున్న వారికీ సర్టిఫికెట్స్ ప్రదానం

జనగామ జిల్లా కేంద్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో ఎంఎస్ఎంఈ, డిఎఫ్ఓ ఆధ్వర్యంలో 30 రోజుల పాటు జ్యూట్ బ్యాగ్ తయారీపై ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అభ్యర్థులకు శిక్షణ పూర్తి చేసిన అనంతరం సర్టిఫికేట్లను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దశరథ్ (ఏడి , ఎంఎస్ఎంఈ డిఎఫ్ఓ ), మూర్తి (లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్), హర్షవర్ధన్ (పీడీ , మెప్మా ), ఈడిసి మేనేజర్ సతీష్ , జ్యూట్ బ్యాగ్ ఎన్జిఓ ప్రతినిధి వరలక్ష్మీ, ట్రైనర్ వసంత హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, పర్యావరణానికి హితమైన జ్యూట్ బ్యాగ్ తయారీపై ఇలాంటి నైపుణ్య శిక్షణలు యువత, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను పెంచుతాయని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంలో జ్యూట్ ఉత్పత్తుల పాత్ర ఎంతో కీలకమని, భవిష్యత్తులో జ్యూట్ ఆధారిత ఉత్పత్తులకు మంచి మార్కెట్ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో పాల్గొన్న అభ్యర్థులకు జ్యూట్ బ్యాగ్ తయారీకి సంబంధించిన ప్రాథమిక, ప్రాయోగిక నైపుణ్యాలు, ముడి పదార్థాల ఎంపిక, డిజైన్, కుట్టు పద్ధతులు, నాణ్యత ప్రమాణాలు, మార్కెటింగ్ అంశాలపై సమగ్రంగా శిక్షణ అందించబడిందని. శిక్షణ పొందిన అభ్యర్థులు స్వయం ఉపాధి ప్రారంభించడానికి అవసరమైన అవగాహన, నైపుణ్యాలను సంపాదించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమం ముగింపులో శిక్షణను విజయవంతంగా పూర్తిచేసుకున్న శిక్షణార్థులకు సర్టిఫికేట్లు అందజేయడంతో పాటు, భవిష్యత్తులో స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు.



## చిన్నారి మృతి కారకులను

# శిక్షించాలి

**లేదంటే హైదరాబాద్‌ను దిగ్బంధిస్తాం**

**మాజీమంత్రి తలసాని హెచ్చరిక**

**నాగర్‌కర్నూల్ ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం)**

కుమ్మెర మల్లన్న జాతరలో రెండు నెలల చిన్నారి మృతికి కారణమైన వారిని శిక్షించాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం నాగర్ కర్నూల్ కేంద్రంలో కుమ్మెర బాధితుల పక్షాన చేపట్టిన దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజులలో దోషులపై చర్యలు తీసుకోకుంటే హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తామని , అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అభం శుభం తెలియని చిన్నారి మృతికి కారకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు అవుతున్న బడుగు బలహీన వర్గాల ప్రజల పట్ల కొనసాగుతున్న వివక్ష, దాడులు, దౌర్జన్యాలు, ఆలయాల్లో ప్రవేశంపై ఆంక్షలు కొనసాగడం బాధాకరమని అన్నారు. దేవుడిని దర్శించుకునే అర్హత బలహీన వర్గాలకు లేదా ? అని ప్రశ్నించారు. కుమ్మెర దోషులను రక్షించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.



## ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

**వలసదారుల పట్ల అనుసరిస్తున్న విధానంపై కోర్టు ఆగ్రహం**

**న్యూయార్క్, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం):**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఆ దేశ న్యాయస్థానాల్లో వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ప్రపంచ దేశాలపై సుంకాల విషయాల ఇప్పటికే కోర్టు నుంచి వ్యతిరేక తీర్పు రాగా.. తాజాగా వలసదారుల విషయంలోనూ అదే అనుభవం ఎదురైంది. అక్రమ వలసదారులను వారికి సంబంధం లేని ఇతర దేశాలకు తరలించడాన్ని అక్కడి ఫెడరల్ కోర్టు తప్పుబట్టింది అక్రమ వలసదారుల విషయంలో ట్రంప్ కార్యవర్గం తీసుకున్న నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ మసాచుసెట్స్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి తీర్పునిచ్చారు. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులను టార్గెట్ చేసిన సంగతి తెలిసిందే. అక్రమ వలసదారులను అమెరికా నుంచి గ్వాటమాల, దక్షిణ సూడాన్, కోస్టారికా వంటి ఇతర దేశాలకు తరలించారు. దీంతో ఈ తరలింపు ముప్పును ఎదుర్కొంటున్న వలసదారులు కోర్టులో దావా వేశారు. దావాపై తాజాగా న్యాయస్థానంలో విచారణ జరిగింది. సరైన భద్రతా చర్యలు తీసుకోకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, తగిన సమయం ఇవ్వకుండా వారికి సంబంధం లేని వేరే దేశాలకు తరలించడం చట్ట విరుద్ధమని కోర్టు తీర్పునిచ్చింది (÷బి।ట।సజీ ఇనీబీసబి తిపపతిణసజీబితినీని ఇజీబ।). ట్రంప్ కార్యవర్గం నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు ట్రంప్ యంత్రాంగానికి 15 రోజుల సమయం ఇచ్చింది.

## ది కేరళ స్టోరీ విడుదలకు బ్రేక్

**సెన్సార్ బోర్డును తప్పుపట్టిన హైకోర్టు**

**తిరువనంతపురం, ఫిబ్రవరి 26 (ప్రభాత ఉదయం):**

సరిగ్గా విడుదలకు ఒక్కరోజు ముందు 'ది కేరళ స్టోరీ2' మూవీకి న్యాయపరంగా ఎదురుదెబ్బ తగిలింది. సినిమా ప్రచార చిత్రంలో కేరళను తప్పుగా చూపించారని, మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే అంశాలు ఉన్నాయని సామాజిక మాధ్యమాల వేదికగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సినిమా విడుదలపై స్టే విధించాలని, సెన్సార్ సర్టిఫికేషన్ రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై గురువారం రాష్ట్ర హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) తీరును హైకోర్టు తప్పుపట్టింది. సినిమా పునః పరిశీలించాల్సిందిగా జస్టిస్ కురియన్ థామస్ సీబీఎఫ్‌సీకి సూచించారు. అప్పటివరకూ సినిమా విడుదలపై స్టే విధిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. 2023లో వివాదాల నడుమ విడుదలైన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా ఈ సినిమా రూపొందింది. దీనికి కామాఖ్యా నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించగా విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించారు. ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా నటించారు. ప్రేమ మాయలో పడి కొందరు అమ్మాయిలు.. కన్నవాళ్లను ఎదురించి తమ ప్రియుడితోనే జీవితం అనుకుని దూరమవుతుంటారు. కానీ రోజులు గడుస్తున్నకొద్దీ ఆ ప్రేమే ఓ పెద్ద మోసమని తెలుసుకున్నాక దిక్కుతోచని పరిస్థితుల మధ్య ఎవరికీ చెప్పుకోలేని హింసని భరిస్తుంటారు. అలాంటి నిజజీవిత కథాంశంతో 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్' రూపొందింది. ఫిబ్రవరి 27న ఈ మూవీని విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కేరళ హైకోర్టు ఉత్తర్వులతో ప్రస్తుతం వాయిదా పడింది.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608